ఈరోజు (13 జూన్) విలేకర్ల సమావేశం జరిగింది. ఆ వివరాలను ప్రచురణార్థం/ప్రసారార్థం కొరకు మీకు పంపిస్తున్నాము.
–జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

**ఏడు ప్రధాన డిమాండ్లపై 16న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు**
**– సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి మధు**

కరోనా నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిన నేపథ్యంలో కార్మికులను ఆదుకునేందుకు సిపిఎం రాష్ట్రకమిటీ రూపొందించిన ఏడు ప్రధాన డిమాండ్లపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి మధు తెలిపారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవితో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడంతో గతంలో ఎన్నడూ కనీ వినీ ఎరుగని రీతిలో దేశంలో నిరుద్యోగం పెరిగిందని అన్నారు. ప్రభుత్వ రంగంలో బలమైన వైద్య వ్యవస్థ ఉన్న దేశాల్లో కరోనా నివారణ చర్యలు ఫలితాలిచ్చాయని, బలహీనంగా ఆరోగ్య వ్యవస్థ ఉన్నచోట్ల కరోనాకు సరైన వైద్యం కూడా అందడం లేదన్నారు. కరోనా ప్రభావిత దేశాల్లో భారతదేశం 4వ స్థానంలో ఉందని గుర్తుచేశారు. కేంద్ర విడుదల చేసిన రూ.20 లక్షల కోట్ల ప్యాకేజీ కార్మికులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరేదిగా లేదన్నారు. లాక్‌డౌన్‌తో కష్టాలపాలయిన వలస, వ్యవసాయ కార్మిక, అలాగే ఇతర కార్మికులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు జూన్ 16న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ముందు ఉదయం 8గంటల నుండి 12 గంటల వరకు నిరసన, ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. సిపిఎం దేశవ్యాప్తంగా ఇచ్చిన ఈ పిలుపును అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, పార్టీ కార్యకర్తలు గ్రామాలు, పట్టణాల్లో జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**డిమాండ్లు :**

1) ప్రతి కుటుంబానికి కేంద్ర రూ.7,500 నగదు ఆరు నెలలు ఇవ్వాలి.
2) ఒక్కో వ్యక్తికి 10 కేజీల బియ్యం ఆరు నెలలు పంపిణీ చేయాలి.
3) నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ప్రకటించాలి.
4) గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలి, కనీస వేతనం అమలు చేయాలి.
5) పట్టణాల్లో ఉపాధి భరోసా కార్యక్రమాలు చేపట్టాలి.
6) కరోనాను అడ్డంపెట్టుకుని సవరించిన కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలి. పాత వాటినే అమలు చేయాలి.
7) రూ.20 లక్షల కోట్ల ప్యాకేజీ పేరుతో తెస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలి.

**అవినీతి, కుంభకోణాలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి**

రాష్ట్రంలో చోటుచేసుకున్న అవినీతి, కుంభకోణాలపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలని మధు అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజకీయాలతో ప్రమేయం లేకుండా చట్టం తన పని తాను చేసుకుపోవాలని అన్నారు. తెలంగాణలో ఇఎస్‌ఐ కుంభకోణం దోషులు ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్నారని, ఏపిలో ఈ చర్యలు ఆలస్యమయ్యాయని తెలిపారు. ఇఎస్‌ఐలో భారీ కుంభకోణం జరిగిందని 2019 జనవరి 10నే సిపిఎం చెప్పిందని గుర్తుచేశారు. వాస్తవాల ఆధారంగా దోషులపై చర్యలు తీసుకోవాలని, కక్షపూరిత చర్యలు ఉండకూడదని సిపిఎం అభిప్రాయపడుతోందని స్పష్టం చేశారు. ఇలాంటి కుంభకోణాలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**పాత్రికేయులకు బీమా సౌకర్యం కల్పించాలి**

కరోనా నివారణలో ముందు వరుసలో పోరాడుతున్న వారిలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమైనదని మధు కొనియాడారు. కరోనా విజృంభిస్తున్న తరుణంలో పాత్రికేయులకు రక్షణ లేకుండా పోయిందని, ప్రభుత్వం వీరి సంక్షేమాన్ని గాలికొదిలేయడం బాధాకరమన్నారు. కరోనా నివారణలో ముందు వరుసలో ఉండి పోరాడుతున్న వారికి కేంద్ర కల్పించిన రూ.50లక్షల బీమా సౌకర్యాన్ని పాత్రికేయులకు వర్తింపజేసేలా కేంద్ర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పాత్రికేయులకు బీమా సౌకర్యం కల్పించడానికి కృషి చేయాలని, లేని పక్షంలో దీనిపై కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు.

= = = =